నిండుకుండలా మన్యం జలాశయాలు

- జల్లేరు, కొవ్వాడ, పోగొండ జలాశయాల్లో పుష్కలంగా నీరు
- రబీ సాగుపై చిగురిస్తున్న ఆశలు
- 13,200 ఎకరాల్లో పంటలు వేసిన రైతులు



బుట్టాయగూడెం మండలం జల్లేరు జలాశయంలో జలకళ



పుష్కలంగా నీటితో పోగొండ రిజర్వాయర్

బుట్టాయగూడెం: పశ్చిమ మన్యంలోని జలాశయాలు నిండుకుండలను తలపిస్తున్నాయి. జూలై, ఆగస్టు నెలలతో పాటు సెప్టెంబర్‌లో కురిసిన వర్షాలతో జలాశయాల్లో భారీగా నీరు చేరి నిండుకుండలా కళకళలాడుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వర్షాలు, బోర్ల కింద రైతులు పంటలు పండించారు. అయితే రబీకి సంబంధించి బుట్టాయగూడెం మండలం గుబ్బల మంగమ్మ జల్లేరు జలాశయం, చింతలగూడెం సమీపంలోని పోగొండ రిజర్వాయర్, అలాగే కొవ్వాడ ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టు రైతులు వివిధ పంటలు వేసేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే రైతులు ఆయా ఆయకట్టల పరిధిలో పంటలు వేశారు.

సుమారు 13,200 ఎకరాల్లో పంటలు వేసిన రైతులు

మండలంలోని గుబ్బల మంగమ్మ జల్లేరు జలాశయం, పోగొండ రిజర్వాయర్, కొవ్వాడ ప్రాజెక్టు పరిధిలో సుమారు 13,200 ఎకరాల్లో రైతులు పంటలు పండిస్తున్నారు. రబీకి సంబంధించి జలాశయాల్లో పుష్కలంగా నీరు ఉండడంతో పంటల సాగుపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పూర్తి నీటి సామర్థ్యం 217.80 మీటర్లు కాగా ప్రస్తుతం 216.60 మీటర్ల ఎత్తులో నీరు నిల్వ ఉంది. అలాగే పోగొండ రిజర్వాయర్ 150 మీటర్లు నీటి సామర్థ్యం ఉండగా అది పూర్తి స్థాయిలో నిండి ఉంది. అలాగే కొవ్వాడ జలాశయంకు సంబంధించి 90.50 మీటర్లు పూర్తి నీటి సామర్థ్యం కాగా ప్రస్తుతం 85.70 మీటర్లు నీరు ఉన్నట్లు ఎంఐ అధికారులు తెలిపారు. అలాగే ఈ రబీ సీజన్‌కు సంబంధించి జల్లేరు జలాశయం పరిధిలో 4,200 ఎకరాలు, పోగొండ రిజర్వాయర్‌కు సంబంధించి 7,500 ఎకరాలు, కొవ్వాడకు సంబంధించి 1,500 ఎకరాలు మొత్తం 13,200 ఎకరాల్లో రబీ సీజన్‌లో రైతులకు జలాశయాల ద్వారా నీరు పుష్కలంగా అందనున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఇప్పటికే ఆయా ప్రాజెక్టుల పరిధిలో ప్రత్తి మొక్కజొన్న, మినుము, పెసరతో పాటు వర్జీనియా పొగాకు పంటలు కూడా రైతులు వేయడం జరిగింది.

చివరి ఆయకట్టు రైతుకూ నీరందించేలా కృషి



రబీలో చివరి ఆయకట్టు రైతులకూ నీరు అందించేలా కృషి చేస్తున్నాం. రైతులు వంతుల వారీగా నీటిని వినియోగించుకుంటూ పంటలు పండించుకోవాలి. జల్లేరు జలాశయం, పోగొండ రిజర్వాయర్, పరిధిలో ఇప్పటికే రైతులు పంటలు వేశారు. వీరందరికీ నీరు అందేలా కృషి చేస్తున్నాం.

– పందిరి ఆనంద్ కుమార్, ఎంఐ డీఈఈ,
కేఆర్‌పురం సబ్ డివిజన్, బుట్టాయగూడెం మండలం

బ్రాహ్మణులు అన్ని రంగాల్లో ముందుండాలి



జంగారెడ్డిగూడెంలో ప్రాంతీయ బ్రాహ్మణ పరిషత్ సమావేశంలో పాల్గొన్న సభ్యులు

జంగారెడ్డిగూడెం: బ్రాహ్మణులు అన్ని రంగాల్లో ముందుండాలని, రాబోయే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు వారు బ్రాహ్మణులకి సముచిత స్థానం కల్పించి బ్రాహ్మణల అభివృద్ధికి కృషి చేయాలని ప్రాంతీయ బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షుడు చిలుకూరి సాయిబాబు కోరారు. ఆదివారం జంగారెడ్డిగూడెంలో ప్రాంతీయ బ్రాహ్మణ పరిషత్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ బ్రాహ్మణులు అన్ని రంగాల్లో ఎదగాలంటే బ్రాహ్మణులు అందరూ పార్టీలకు అతీతంగా ఐక్యతతో సాగాలని పిలుపునిచ్చారు. ప్రాంతీయ బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో 40 ఏళ్ల నుంచి కార్తీక వనసమారాధన నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా ఈ ఏడాది డిసెంబర్ 3వ తేదీన జంగారెడ్డిగూడెంలో పర్వతం.తులసిరావు (లెక్చరర్) మామిడి తోటలో కార్తీక వనసమారాధన ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణులు అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయవలసినదిగా కోరారు. బ్రాహ్మణ కమ్యూనిటీ భవనం నిర్మాణం కొరకు అందరూ సహాయ సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి కూచిబొట్ల రాము, సభ్యులు వెలివెల పెద్దిరాజు, ఈరంకి రవి, మధనంబెడు కృష్ణప్రియ, లంక నాగకుమార్, సమయమంత్రి రాధాకృష్ణ, కూచి త్రినాథరావు, చిలుకూరి లక్ష్మీనారాయణ, గన్నవరపు మాధవరావు, మధనంబెడు సుబ్బారావు, బట్టు భాస్కర్, కనుపర్తి రవి, కల్లూరి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉనికిని చాటింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే



కొయ్యలగూడెంలో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

కొయ్యలగూడెం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉనికిని చాటుతోంది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని అందుకు నిదర్శనంగా రాష్ట్ర అవతరణ వేడుకలు నిర్వహిస్తున్నామని ఎంపీపీల ఛాంబర్ జిల్లా అధ్యక్షుడు, పోలవరం ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కొయ్యలగూడెంలోని ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన ఆయన మహిళా ప్రజాప్రతినిధులతో కలసి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర విభజన అనంతరం పాలనలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం నవంబర్ ఒకటవ తేదీనే విస్మరించి రాష్ట్ర అవతరణ వేడుకలకు తిలోదకాలు ఇచ్చింది అన్నారు. దేశంలోని 28 రాష్ట్రాలు కూడా ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తుంటే 2014 నుంచి 2018వ సంవత్సరం వరకు రాష్ట్ర అవతరణ వేడుకలు నిర్వహించని ఘనత అప్పటి టీడీపీ ప్రభుత్వానికే దక్కింది అని ఎద్దేవా చేశారు. తెలుగుకి విలువ అంటూనే ఐదు కోట్ల నలభై ఆరు లక్షల మంది తెలుగు ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం వేడుకలను మరుగున పరిచింది అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అయిన పిదప ఆంధ్ర రాష్ట్ర అవతరణ వేడుకలు ఘనంగా నిర్వహిస్తూ అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగానికి విలువనిస్తూ వస్తున్నారని అన్నారు. జిల్లా విద్యా వైద్య స్టాండింగ్ కమిటీ సభ్యురాలు జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, స్టేట్ ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి, సీతంపేట సర్పంచ్ తోటకూర పద్మావతి పాల్గొన్నారు.

బాలుర వసతి గృహం తనిఖీ



వసతి గృహంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జెడ్పీటీసీ రమేష్

కామవరపుకోట: మండలంలో స్థానిక ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని జెడ్పీటీసీ, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు కడిమి రమేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు వివరాలపై వసతి గృహం సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆహారం రుచి, నాణ్యత, పరిమాణం, మెనూ అమలు, మంచినీటి సదుపాయం తదితర వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు వినియోగించుకుని ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు అందించే ఆహారంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జెడ్పీటీసీ రమేష్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మేడూరి రంగబాబు, సొసైటీ అధ్యక్షుడు సాయన కనకరాజు, ఎంపీటీసీలు బొల్లు సత్యనారాయణ, పాలిమెట్ల ప్రశాంత్, కన్నా, మేడంకి చిన్న, డాక్టర్ సుబ్రహ్మణ్యం, వార్డ్ మెంబర్ సిద్దిరాజు పాల్గొన్నారు.

ప్రజారక్షణ భేరి పోస్టర్ల విడుదల



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

కొయ్యలగూడెం: నవంబర్ 15వ తేదీన విజయవాడలో తలపెట్టిన ప్రజా రక్షణ భేరి సభకు సంబంధించి ఆదివారం సీపీఎం నాయకులు పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ ప్రజల సమస్యలే ప్రధాన ఎజెండాగా ఈనెల 30 నుంచి రాష్ట్రంలో మూడు బస్సు యాత్రలు ప్రారంభం కానున్నాయన్నారు. నవంబర్ 15వ తేదీన విజయవాడలో ప్రజా రక్షణ భేరి సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆ పార్టీ మండల కార్యదర్శి శుక్ల బోయిన రాంబాబు, మాట్లాడుతూ నవంబర్ 7వ తేదీన కొయ్యలగూడెంకు బస్సు యాత్ర వస్తుందని, సీపీఎం కార్యకర్తలు సానుభూతిపరులు, ప్రజాసంఘాలు అన్ని రంగాల కార్మికులు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గుడెల్లి వెంకటరావు, మండల నాయకులు ఎ.దుర్గారావు, ఎస్.శివకుమార్, సీహెచ్ మరిడియా, పిల్లా తమ్మారావు, మర్త్రిమూర్తులు, జి.గోపి, పి.సురేష్, రాచూరి దుర్గారావు, రాచూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

శరవణుడికి స్వర్ణ నేత్రాల సమర్పణ



స్వర్ణ నేత్రాలు, బొట్టుతో శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

కొయ్యలగూడెం: ఏజెన్సీ మెట్ట ప్రాంతంలో ప్రఖ్యాతిగాంచిన బయ్యనగూడెంలోనే శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి బంగారు నేత్రాలు సమర్పించారు. బయ్యనగూడెం పీహెచ్‌సీ డాక్టర్ విజయకృష్ణ స్వామివారికి రూ.24 వేలు విలువచేసే బంగారు నేత్రాలు, నుదుటిబొట్టు కానుకగా అందజేశారు. అదేవిధంగా వెండి నేత్రాలను అమ్మవార్లకు అందజేశారు. ఆలయ ధర్మకర్త బాలం దత్తుడు, సమక్షంలో ప్రధాన అర్చకులు కొత్తలంకోవ సత్యనారాయణ ఆచార్యులు బంగారు ఆభరణాలను స్వామివారికి అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న అన్న సమారాధన కార్తీకమాసంలో కూడా ప్రతి మంగళవారం అమలు చేస్తామని ధర్మకర్త ఈ సందర్భంగా పేర్కొన్నారు.

2 నుంచి పాట్నాలో బీకేఎంయూ జాతీయ మహాసభలు

ఏలూరు (టూటౌన్): భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బీకేఎంయూ) 15వ జాతీయ మహాసభలు నవంబరు 2 నుంచి 5వ తేదీ వరకూ బీహార్ రాజధాని పాట్నాలో నిర్వహించనున్నట్టు యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక స్ఫూర్తి భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో జాతీయ మహాసభల వివరాలను ఆయన వెల్లడించారు. ఈ జాతీయ మహాసభలకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి 11 మంది ప్రతినిధులు హాజరవుతున్నట్లు తెలిపారు. జాతీయ మహాసభలలో మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలపై ప్రజా వ్యతిరేక విధానాలపై, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల పట్ల వ్యతిరేక చర్యలపై చర్చించి పలు తీర్మానాలు చేయనున్నట్టు తెలియజేశారు. ఉపాధి హామీ చట్టాన్ని సక్రమంగా అమలు చేసే విధంగా కేంద్రంపై ఒత్తిడి తెచ్చే పోరాట కార్యాచరణ మహాసభ రూపొందిస్తుందన్నారు.

ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు పేదలకు పంపిణీ



ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ శ్రీలక్ష్మి

ఉంగుటూరు: ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు పేదలకు ఎంతో ఉపయోగమని ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి అన్నారు. ఆదివారం ఉంగుటూరు పంచాయతీ సామాజిక భవనం వద్ద 90 మందికి ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గంటా శ్రీలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచి బండారు సింధు, ఎంపీటీసీ సభ్యులు పెనుగొండ బాలకృష్ణ, సందక రాంబాబు, ఉప సర్పంచి పాతూరి జగదీష్, చేబ్రోలు ఇండియన్ గ్యాస్ కంపెనీ డీలరు నోచర్ల శ్రీనివాసు, పంచాయతీ వార్డు సభ్యులు సూరత్తుల శ్రీను, బండారు మధు పాల్గొన్నారు.

పట్టుదలతో కృషి చేస్తే ఉన్నత ఉద్యోగాలు



వెల్లమిల్లిలో సాగర్‌బాబును సత్కరిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: విద్యార్థి స్థాయి నుంచి ఎంచుకున్న రంగంలో పట్టుదలతో కృషి చేస్తే ఉన్నత ఉద్యోగ అవకాశాలు సులభంగా సాధించవచ్చని సెంట్రల్ బోర్డు డైరెక్టర్ ఆఫ్ టాక్సెస్ అసిస్టెంట్ కమిషనర్ యాళ్ల సాగర్‌బాబు అన్నారు. ఆదివారం వెల్లమిల్లిలో షాలేము పెంతుకోస్తు ప్రార్థన మందిరంలో పాస్టర్ ఇస్రాయెల్ అధ్యక్షతన సాగర్‌బాబును ఘనంగా సభ్యులు సత్కరించారు. జంగారెడ్డిగూడెం మండలం జొన్నవారిగూడెంకు చెందిన యాళ్ల సాగర్‌బాబు ఇటీవల ప్రభుత్వం ప్రకటిరచిన సివిల్స్ పరీక్షలో ప్రతిభచూపి రెవెన్యూ సర్వీసుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సాగర్‌బాబు మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలని అన్నారు. ఎంచుకున్న రంగంలో విజయం సాధించేందుకు ప్రభుత్వం అందిస్తున్న విద్యావనరులను సద్వినియోగం చేసుకుని ప్రణాళికబద్ధంగా ముందుకు సాగాలని యువతకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి కష్టాలను అధిగమించి ఈ స్థాయికి వచ్చానని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, యువత పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వై.మంగయ్య తెలిపారు. వివరాల ప్రకారం పంగిడిగూడానికి చెందిన యువతి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతోంది. ఈ నెల 28న సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన యువతి తిరిగి రాకపోవడం, ఆమె ఫోన్ స్విచ్ఛాఫ్ ఉండడం, చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెదికినా ఆచూకి లభించకపోవడంతో యువతి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. డిగ్రీ కళాశాలలో చదువుతున్న కార్తీక్ అనే యువకుడిపై అనుమానం ఉన్నట్లు యువతి తల్లి ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఏఎస్సై చెప్పారు.

మద్యం పట్టివేత

జంగారెడ్డిగూడెం: ఎటువంటి అనుమతులు లేకుండా ఇంటి వద్ద మద్యం విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై మంగయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం శ్రీనివాసపురం గ్రామానికి చెందిన దాసరి వెంకట నరసమ్మ ఎటువంటి అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తుండగా, ఆమెను అరెస్ట్ చేసి ఆమె వద్ద నుంచి రూ.600 విలువైన 4 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

మోటార్‌సైకిళ్ల చోరీ

జంగారెడ్డిగూడెం: పట్టణంలో రెండు మోటార్ సైకిళ్ల చోరీకి గురైనట్లు ఫిర్యాదులు అందాయని ఎస్సై మల్లికార్జునరెడ్డి తెలిపారు. వివరాల ప్రకారం.. జంగారెడ్డిగూడెం శ్రీనివాసపురం రోడ్‌లో నివాసం ఉంటున్న సీసం రాము ఈ నెల 28న మధ్యాహ్నం ఇంటి వద్ద మోటార్‌సైకిల్‌ను పార్క్ చేశాడు. సాయంత్రం 5 గంటలకు బయటకు వచ్చి చూసే సరికి మోటార్‌సైకిల్ కనిపించలేదు. దీంతో రాము మోటార్‌సైకిల్ చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మరో ఘటనలో జంగారెడ్డిగూడెం అయ్యప్ప టౌన్‌షిప్‌నకు చెందిన కంపా నాగేశ్వరరావు ఈ నెల 11వ తేదీ రాత్రి ఇంటి వద్ద మోటార్‌సైకిల్‌ను పార్క్ చేయగా రాత్రి ఒంటి గంట సమయంలో బయటకు వచ్చి చూసే సరికి మోటార్‌సైకిల్ కనిపించలేదు. అప్పటి నుంచి మోటార్‌సైకిల్ కోసం వెదికినా ఫలితం లేకపోవడంతో ఆదివారం నాగేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మోటార్‌సైకిళ్ల చోరీలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

50 వేల చిన్న శివలింగాల తయారీ

దెందులూరు: శ్రీ రామదండు ఆధ్వర్యంలో ఆదివారం బీఆర్‌డీ నర్సింగ్ కళాశాలలో కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు, డైరెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో దెందులూరులో భక్తులు 50 వేల చిన్న శివలింగాలను తయారు చేశారు. తయారు చేసిన చిన్న శివలింగాలను బాక్సుల్లో భద్రపరిచారు. ఆదివారం సాయంత్రం కరస్పాండెంట్ నూకరాజు మాట్లాడుతూ శనివారం 40 వేలు, ఆదివారం 50 వేలు శివలింగాలు తయారు చేశామన్నారు. కోటి శివలింగాల మహోత్సవం కార్యక్రమంలో భాగంగా భక్తులు చిన్న శివలింగాలను తయారు చేస్తున్నారని, తయారు చేసిన శివలింగాలను కాశీకి పంపించనున్నట్టు వివరించారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఓపీఎస్ అమలు చేయాలి

పెదవేగి : ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల అభ్యున్నతి ఓపీఎస్‌ను కొనసాగించాల్సిందేనని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి అన్నారు. యూటీఎఫ్ పెదవేగి మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ సాబ్జి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకుని జీపీఎస్, సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్‌ను మాత్రమే కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం యూటీఎఫ్ పెదవేగి మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యూటీఎఫ్ పెదవేగి మండల గౌరవాధ్యక్షుడిగా తేరా ప్రభాకర్(పినకడిమి), అధ్యక్షుడిగా టి.ఎడ్వర్డు (పెదవేగి), సహ అధ్యక్షుడిగా బీవీ రావు(లక్ష్మీపురం), కె.రామలక్ష్మి (ప్రకాష్‌నగర్). ప్రధాన కార్యదర్శిగా పీవీ రమణ (కూచింపూడి), కోశాధికారిగా ఎం.లక్ష్మీనారాయణ (రామ శింగవరం), ఆడిట్ కన్వీనర్‌గా వైబీవైవీ కుమార్ (తాళ్లగోకవరం), కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

క్లుప్తంగా

మద్దిలో తిరుమంజనం



చంద్రగ్రహణం సందర్భంగా తిరుమంజనం కార్యక్రమం నిర్వహించిన అర్చకులు

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో తిరుమంజనం కార్యక్రమం, శుద్ధి, సంప్రోక్షణం కార్యక్రమాలు నిర్వహించారు. చంద్రగ్రహణం సందర్భంగా శనివారం మధ్యాహ్నం నుంచి ఆలయం మూసివేయగా ఆదివారం శుద్ధి, సంప్రోక్షణ అనంతరం ఉదయం 8 గంటల నుంచి మద్ది ఆంజనేయస్వామి దర్శనాన్ని భక్తులకు కల్పించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో ఆకుల కొండలరావు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ కార్యాలయాల నూతన భవనాలు ప్రారంభం

కొయ్యలగూడెం: బయ్యనగూడెంలో పలు అభివృద్ధి, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో సోమవారం పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పాల్గొననున్నట్లు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు తుమ్మలపల్లి గంగరాజు, ఉప సర్పంచ్ కోరుకొండ లలితా తెలిపారు. రూ.26 లక్షల నాబార్డు నిధులతో నిర్మించిన పశు వైద్యశాల, సుమారు రూ.25 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనాలను ఎమ్మెల్యే ప్రారంభిస్తారని అన్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి ఎమ్మెల్యే పర్యటనా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక అలంకరణ



విశేష అలంకరణలో రాట్నాలమ్మ తల్లి

పెదవేగి : భక్తుల పాలిట కల్పతరువు రాట్నాలమ్మకు ఆదివారం ప్రీతికరమైన రోజుకావడంతో జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వారం రాట్నాలమ్మకు పూజాటికెట్ల ద్వారా రూ.48,025, విరాళాలు రూ.14,079, లడ్డూ ప్రసాదం విక్రయంతో రూ.18,000, ఫొటోల విక్రయం ద్వారా రూ.1,575, మొత్తం అమ్మవారికి వివిధ రూపాల్లో రూ.81,679 ఆదాయం లభించిందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్ సతీష్ తెలిపారు. దేవస్థానానికి విచ్చేసిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఈఓ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం



దాతలకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు ఆదివారం రూ.1,00,001 విరాళంగా అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన గంజి శ్రీనివాస్ ముందుగా సతీసమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాత దంపతులకు ఆలయ ఏఈఓ ఆర్.లక్ష్మణస్వామి విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

బెల్లపు ఊట ధ్వంసం

పోలవరం రూరల్: మండలంలోని ఎల్ఎన్‌డీపేట గ్రామ సమీపంలో అటవీ ప్రాంతంలో నాటుసారా తయారీ బట్టీలపై పోలవరం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడులలో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 8 డ్రమ్ముల్లోని బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్సై ఎస్ఎస్ పవన్ కుమార్ తెలిపారు. 1,600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి, సారా తయారీదారులపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

వివాహిత మృతిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: వివాహిత మృతిపై తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఈనెల 28వ తేదీ సాయంత్రం అపార్ట్‌మెంట్‌పై నుంచి దూకి వివాహిత విజయలక్ష్మి ఆత్మహత్య చేసుకున్న సంగతి పాఠకులకు తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి విజయలక్ష్మి తండ్రి బొండా ఈశ్వర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కుమార్తెకు జంగారెడ్డిగూడెంకు చెందిన అనిల్‌కుమార్‌కు సెప్టెంబర్ 1న వివాహమైందన్నారు. 28వ తేదీ శనివారం సాయంత్రం విజయలక్ష్మికి కడుపునొప్పి రావడంతో మందుల కోసం భర్తను బయటకు పంపిందని, నొప్పి తీవ్రత ఎక్కువ కావడంతో భరించలేక అపార్ట్‌మెంట్‌పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుందని చెప్పారు. ఆమెను హుటాహుటిన స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించినా విజయలక్ష్మి అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారన్నారు. ఈశ్వర్ ఫిర్యాదుతో కేసు నమోదుచేసినట్లు ఎస్సై చెప్పారు.

యూటీఎఫ్ నూతన కమిటీ ఏర్పాటు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మండల యూటీఎఫ్ కౌన్సిల్ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు యూటీఎఫ్ ఎన్నికల అధికారి ఎం.వి.శ్యాంబాబు తెలిపారు. మండల అధ్యక్షుడిగా ఎస్‌కే తడాహికో, ప్రధాన కార్యదర్శి టి.రామకృష్ణ, గౌరవాధ్యక్షుడు ఎం.మురళీమోహన్, సహాయ అధ్యక్షుడు పీవీ సత్యనారాయణ, ఎస్ఎల్ఎల్ సుజాత, ట్రెజరర్ ఎస్.ఏసురత్నం, కార్యదర్శులు ఎ.శ్రీనివాసరావు, కె.సత్యనారాయణ, ఎస్‌కే మస్తాన్ వలీ, ఎం.రవి, టి.కృషివరరావు, ఎం.పాపారావు, టి.గంగాముత్యం, కె.జయ, పి.రాణి ఎన్నికయ్యారు. అలాగే ఆడిట్ కమిటీ సభ్యులుగా ఆరుగురిని, జిల్లా కౌన్సిలర్‌లుగా 8 మందిని, కార్యవర్గ సభ్యులుగా 40మందిని ఎన్నుకున్నట్లు చెప్పారు.

నేటినుంచి ఏఎంసీ యార్డులో పత్తి కొనుగోళ్లు

చింతలపూడి: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పత్తి రైతుల నుంచి పత్తి పంటను కొనుగోలు చేయనున్నట్లు ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి ఆదివారం పేర్కొన్నారు. ఈనెల 30వ తేదీ నుంచి జంగారెడ్డిగూడెం మార్కెట్ కమిటీ యార్డులో కొనుగోళ్లు ప్రారంభిస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రభుత్వం దీర్ఘకాలిక పత్తి రకానికి క్వింటా రూ.7,020, మధ్యరకం పత్తి పంట క్వింటాలుకు రూ.6,620 మద్దతు ధర ప్రకటించారన్నారు. మార్కెట్ కమిటీ పరిధిలోని చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల రైతులు తమ పత్తి పంటను సీసీఐకి విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు. రైతులు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకాల జిరాక్స్ కాపీలను తీసుకుని ఆర్‌బీకే కేంద్రాల్లో నమోదు చేసుకుని టోకెన్ పొందాలని చెప్పారు. పత్తి తేమ శాతం 8 శాతం ఉండాలని, 8 శాతానికి మించి ఉంటే ఒక్కో శాతానికి రూ.55.50 చొప్పున ధర తగ్గుతుందన్నారు. తేమ శాతం 12 శాతానికి మించి ఉంటే సీసీఐ కొనుగోలు చేయదని పేర్కొన్నారు.

2 లీటర్ల సారా స్వాధీనం

టి.నరసాపురం: నాటు సారా కలిగి ఉన్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై బి.సురేంద్రకుమార్ తెలిపారు. వివరాల ప్రకారం బొర్రంపాలెం గ్రామానికి చెందిన బైగాని విశ్వేశ్వరరావు నాటు సారా కలిగి ఉన్నారనే సమాచారం మేరకు బొర్రంపాలెంలో పోలీసులు దాడులు నిర్వహించారు. విశ్వేశ్వరరావు వద్ద నుంచి రెండు లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

శ్రీనివాసపురంలో అన్నసమారాధన

జంగారెడ్డిగూడెం రూరల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీనివాసపురంలో శ్రీఉప్పలమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఉప సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా ఉప్పలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

భీమడోలు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని భీమడోలు పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. లక్ష్మీపురానికి చెందిన దేవతోటి అప్పారావు ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి నిబంధనలకు విరుద్ధంగా మద్యం బాటిళ్లు తెచ్చుకుని లక్ష్మీపురం బస్టాండ్ వద్ద స్థానికులకు విక్రయిస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఆతని వద్ద గల 8 లిక్కర్ క్వార్టర్స్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై సీహెచ్ సురేష్‌కుమార్ తెలిపారు.